సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 2 । ఆగస్టు । 2023



వెంటాడిన మృత్యువు

పాముకాటుతో విద్యార్థి మృతి చెందాడు. తోలాపిలో ఘటన జరిగింది.

- 8లో



వైద్యారోగ్య శాఖపై ఆగ్రహం

కలెక్టర్ వైద్యారోగ్య శాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

- 8లో

పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో మంగళవారం పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్యాంపస్‌తో పాటు, ఆరు అఫిలియేషన్ కళాశాల విద్యార్థులు సైతం పరీక్ష రాస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 14 వరకు పరీక్షలు జరగనున్నాయి. 612 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

పీడియాట్రిక్ సర్టిఫికెట్ అందజేత

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో ముస్కాన్ నేషనల్ స్టాండ్స్ ప్రకారం ఈ నెల 21,22 తేదీల్లో పరిశీలన నిర్వహించారు. పీడియాట్రిక్ డిపార్టుమెంట్‌లో ఓపీడీ, ఐపీడీ, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ విభాగాల్లో నిర్వహించిన పరిశీలనలో ఈ నాలుగు డిపార్ట్ మెంట్లు 91 శాతం స్కోర్ సాధించాయి. దీంతో క్వాలిటీ ఆఫీసర్ డాక్టర్ కోటేశ్వరరావు, పీడియాట్రిక్ డాక్టర్ శ్రావ్య, డాక్టర్ సుజాత, ఎన్‌పీహెచ్‌డీలకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సర్టిఫికెట్లను అందజేశారు.

లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం నేడు ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కోర్టులో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ప్రారంభించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన మంగళవారం కోర్టు హాల్‌లో మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆఫీసు కార్యాలయం మొదటి అంతస్తులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను ప్రారంభిస్తున్నామని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా కె.ఆఫీసు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పుట్ట అంజనీ కుమార్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పైడి హర్షవర్ధన్ నియమితులయ్యారని తెలిపారు. న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారి కేసులను ఉచితంగా న్యాయసేవాధికార సంస్థ తరపున లాయర్లు వాదిస్తారన్నారు.

అమ్మ పాలు అమృత తుల్యం



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: అమ్మపాలు బిడ్డకు అమృతం వంటివని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు అన్నారు. మంగళవారం లొద్దపుట్టి అంగన్‌వాడీ సెక్టారు పరిధిలో తల్లిపాలు వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లులు, గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లి పాలు పిల్లల పెరుగుదలకు, మేధాశక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నా రు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. రూరల్ సీడీపీఓ పురాణం నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, సర్పంచ్ ఆశి సులోచనారెడ్డి, ఎంపీటీసీలు పిట్ట హేమలత రెడ్డి, ఆశి మందాకిని, కౌన్సిలర్ బచ్చు జగన్ రెడ్డి, సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి, పి.పల్లవిలు పాల్గొన్నారు.

కాలినడకన కొండెక్కిన జేసీ



కాలినడకన కొండెక్కుతున్న జేసీ నవీన్

మెళియాపుట్టి: పర్వత శిఖర ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు మూడు నెలల రేషన్ ఒకేసారి అందిస్తామని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ అన్నారు. ఆయన మంగళవారం పర్వత శిఖర గ్రామమైన కేరాసింగికి కాలినడకన నడిచి వెళ్లారు. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం నడిచి గిరిజనులను కలిశారు. వారితో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి రహదారి నిర్మించాలని, కొండ నుంచి వస్తున్న జక్కర నీరు గ్రామంలోకి రాకుండా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, తాగునీటి కోసం ప్లాట్‌ఫామ్ నిర్మించాలని కోరారు. దానికి జేసీ స్పందిస్తూ.. రహదారి నిర్మాణం జరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, రహదారి నిర్మాణం జరిగేలా కలెక్టర్ దృష్టిలోకి తీసుకెళతామన్నారు. అదేవిధంగా బయోమెట్రిక్, అత్యవసర సమయాలలో సమాచారం అందించడానికి వీలు కలిగే విధంగా రెండునెలల్లో సెల్ టవర్ నిర్మాణం చేపడతామని అన్నారు. పాఠశాల భవనం పునర్నిర్మాణానికి సైతం నిధులు మంజూరు చేస్తామన్నారు. మూడునెలలకు సంబంధించిన రేషన్ సరుకులు ఒకేసారి ట్రాక్టర్ ద్వారా కేరాసింగి, గూడ, చందనగిరి, రింపి, హడ్డివాడ గ్రామాలకు ఇక్కడ వద్దకే అందించడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

అమ్మకో బహుమతి



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు

- ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- నేటి నుంచి టేక్ హోమ్ రేషన్ పంపిణీని ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలోనూ ఫేస్ హాజరుతో రేషన్ పంపిణీకి ఏర్పాట్లు



కంచిలి: అమ్మలకు, కాబోయే తల్లులకు ప్రభుత్వం ఓ తీపి కబురు అందించింది. అంగన్‌వాడీల ద్వారా వీరి సంపూర్ణ పోషణకు ప్రభుత్వం ఇతోధికంగా పనిచేసేది. అందులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలు లాభపడేవారు. ఈ కిట్లను నేరుగా ఇంటికే అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఫేస్ హాజరుతో బుధవారం నుంచి ఈ పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం ఆయా లబ్ధిదారుల ముఖాలను అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల స్మార్ట్‌ఫోన్స్ యాప్‌లలో నిక్షిప్తం చేశారు. పంపిణీ చేసిన సమయంలో వారి ముఖాన్ని సంబంధిత యాప్‌లో ఫోటో క్యాప్చర్ చేసి, వారికి కేటాయించిన కిట్లను అందించడమే తరువాయి. ఇందుకోసం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా 'టేక్ హోమ్ రేషన్' పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా అన్ని మండలాల్లో పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

3,358 అంగన్‌వాడీ కేంద్రాల్లో..

జిల్లాలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 599 ఉన్నాయి. వీటిలో చిన్నారులకు సేవలందించడంతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేవారు. జిల్లాలో 11,782 మంది గర్భిణులు, 12,700 మంది బాలింతలకు సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆహారాన్ని తయారు చేసి, వారికి ప్రతిరోజు వడ్డించేవారు. అదేవిధంగా చిన్నారులకు కూడా మెనూ ప్రకారం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఇక ముందు పాత పద్ధతికి స్వస్తి చెప్పి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయనున్నారు. తర్వాత ఆ ఆహారాన్ని వారే ఉపయోగించే విధంగా సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షిస్తారు.



'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' టేక్ హోమ్ రేషన్ పంపిణీ బ్యానర్

ఇచ్చే సరుకులివే..

- 3 కిలోల బియ్యం, ఒక కిలో కంది పప్పు, అరకిలో వంట నూనె
- నెలలో మొదటి శుక్రవారం 13 గుడ్లు, మూడో శుక్రవారం మరో 12 గుడ్లు
- పాలు మొదటి శుక్రవారం రెండున్నర లీటర్లు, మూడో శుక్రవారం మరో రెండున్నర లీటర్లు
- వైఎస్సార్ పోషణ కిట్లలో బెల్లం, వేరుశెనగ చిక్కీలు, రాగి పిండి, గోధుమ పిండి, ఎండు ఖర్జూరం.
- 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులకు కూడా నెలకు 25 గుడ్లు, 5 లీటర్లు పాలు రెండు శుక్రవారాల్లో ఇవ్వడం జరుగుతుంది.
- 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్.

సకాలంలో పౌష్టికాహారం



మా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులతోపాటు, గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి సరఫరా చేస్తున్న ఆహారం సంతృప్త స్థాయిలో సరఫరా జరుగుతోంది. మేము అందిస్తున్న సేవలు పైన కూడా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– ఆట్ల మోహిని, అంగన్‌వాడీ కార్యకర్త, బలియాపుట్టుగ కాలనీ, కంచిలి మండలం

పకడ్బందీగా పంపిణీ పర్యవేక్షణ



జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆగస్టు 2 నుంచి చేపట్టనున్న టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా ప్రారంభించి, అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటి వరకు చేపట్టిన పాత పద్ధతిలో కూడా సమర్థంగా చేపట్టాం. ఫేస్ యాప్ అటెండెన్స్ ద్వారా ఇక నుంచి సరుకుల పంపిణీ చేపట్టడం వల్ల మరింతగా సేవలందించడానికి వీలు పడుతుంది.

– బి.జయదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ, శ్రీకాకుళం

తొలిరోజు 67.76% పింఛన్ల పంపిణీ



శ్రీకాకుళం నగరంలోని 12వ డివిజన్‌లోని లబ్ధిదారు అప్పలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి

జిల్లాలో మంగళవారం సాయంత్రం వరకు 67.76 శాతం మందికి పింఛన్లను అందజేశారు. పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్, ఏఓ బీవీఎస్ దొర తదితరులు పర్యవేక్షించారు. 3,11,502 పింఛన్లకు గాను 2,11,088 పింఛన్లు పంపిణీ చేశారు.

–శ్రీకాకుళం పాతబస్టాండ్

పోర్టు ఉద్యోగాల పేరిట టోకరా

- రూ.38 లక్షలు తీసుకుని మోసం చేసిన నల్లాన సతీష్
- పోలీసుల వద్దకు చేరిన పంచాయితీ



గార: పోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని దీపావళికి చెందిన నల్లాన సతీష్ అనే వ్యక్తి పోర్టులో ఉద్యోగాలు అని చెప్పి వత్సవలస గ్రామానికి చెందిన ఇద్దరి యువకులకు వద్ద నుంచి రూ.38 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగాలు రాకపోతే తన భూమిని తీసుకోవచ్చని హక్కు పత్రాలు కూడా ఇచ్చాడు. తీరా చూస్తే ఎంత కాలమైనా వారికి ఉద్యోగాలు రాలేదు. ఇచ్చిన డాక్యుమెంట్లు కూడా ఇంకొకరి పేరున ఉన్నాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వత్సవలసకు చెందిన మైలపల్లి ఎర్రయ్యదాసు బాధితులైన ఇద్దరి తరపున సతీష్‌కు రూ.38 లక్షలు ఇచ్చాడు. డబ్బులు ఇచ్చి రెండేళ్లయిపోతున్నా ఉద్యోగాల ఊసు లేకపోవడంతో ఎర్రయ్య సతీష్‌పై ఒత్తిడి తెచ్చాడు. ప్లాట్లు అయినా ఇవ్వాలని ఆ భూమి పత్రాలు చూడడంతో గతంలోనే వేరే పేరుతో సతీష్ అమ్మినట్టు తెలిసింది. ఇదే నల్లాన సతీష్‌కు సారవకోట మండలం కిన్నెరవాడకు చెందిన బైరి వాసుదేవరావు గార మండలం దీపావళి సమీపంలోని రాళ్లపేట వద్ద భూమి కొనుగోలు కోసం రూ. 10 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత అగ్రిమెంట్ కూడా చేసుకున్నాడు. అయినా భూమి వేరే పేరున ఉండటంలో పోలీసులను ఆశ్రయించారు. పై రెండు కేసుల్లో జగనన్నకు చెబుదాంకు ఫోన్ చేసి బాధితులు వివరాలు చెప్పడం, పోలీస్ శాఖలో నమోదు కావడం జరిగింది. ఇప్పటికే వేగంగా దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

పరారీలో ఉన్నాడు..

నల్లాన సతీష్ పరారీలో ఉన్నాడు. అతడిపై నిఘా పెట్టాం. వ్యక్తిగత ప్రతిభతోనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు వస్తాయి. డబ్బులు ఇవ్వడం, తీసుకోవడం తప్పు. సతీష్‌ను త్వరలోనే పట్టుకుంటాం.

– ఎస్.కామేశ్వరరావు, ఎస్ఐ, గార

లంచం అడిగి.. అడ్డంగా దొరికి

- ఏసీబీకి చిక్కిన పురపాలిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్
- రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



పట్టుబడిన ఆర్ఐ గౌరీశంకర్‌తో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగర పురపాలక సంస్థలో పనిచేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఐతం గౌరీశంకర్ రూ. 20 వేలు లంచం తీసుకుంటూ మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. డీఎస్పీ చెప్పిన వివరాల మేరకు..

నగరంలోని బలగ హడ్కో కాలనీ (ఏడో వార్డు) భారతినగర్, శివాలయం సమీపంలో ఓ రిటైర్డు ప్రైవేటు ఉపాధ్యాయుడు తమ్మినేని పురుషోత్తంకు 293 చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో సొంతంగా ఇల్లు నిర్మించేందుకు వేకెంట్ ల్యాండ్ టాక్స్ కోసం మున్సిపల్ కార్పొరేషన్ అథారిటీ వారికి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎంత ట్యాక్స్ ఇంపోర్టు చేయాలి, ఎంత డబ్బులు కట్టాలి అన్నది ఆర్ఐ వివరించారు. కానీ రశీదు ఇప్పించడానికి, అప్లికేషన్లు తదితర అంశాలు ప్రాసెస్ చేయడానికి ఆర్ఐ రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆ విశ్రాంత ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను సంప్రదించారు.

ఇంటి వద్దే..

వీఎల్‌టీ(వేకెంట్ ల్యాండ్ టాక్స్) రశీదు తక్షణమే చేస్తాం.. డబ్బులకు ఇంటికి వస్తున్నామంటూ ఆర్ఐ గౌరీశంకర్ ఉపాధ్యాయునికి మంగళవారం ఉదయం చెప్పడంతో వెంటనే ఏసీబీ అధికారులకు బాధితుడు ఫోన్ చేసి చెప్పారు. ఆర్ఐ అటెండర్ సూర్యారావును తోడ్కొని టూవీలర్‌పై బాధితుని ఇంటికి వెళ్లాడు. అటెండర్ బయట ఉండిపోగా లోపలికి ఆర్ఐ వెళ్లి రూ. 20 వేలు తీసుకుని జేబులో పెడుతుండగా అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఆర్ఐను పట్టుకున్నారు. ఈ దాడులు నిర్వహించిన వారిలో సీఐలు భాస్కర్, హరి, ఎస్ఐలు సత్యారావు, చిన్నంనాయుడు, శేఖర్‌లు ఉన్నారు. దీనిపై డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ఆర్ఐ గౌరీశంకర్‌పై కేసు నమోదు చేశామని, బుధవారం విశాఖపట్నం ఏసీబీ కోర్టులో అతన్ని హాజరుపర్చుతామని అన్నారు.

> ఏ ప్రభుత్వాధికారి అయినా లంచం అడిగితే నిరభ్యంతరంగా 14400 నంబర్‌కు కాల్ చేయండి. లేదంటే నేరుగా బలగలో ఉన్న ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించండి. 48 గంటల్లో చర్యలు తీసుకుంటాం.
>
> - రమణమూర్తి, ఏసీబీ డీఎస్పీ

రికార్డు స్థాయిలో సర్టిఫికెట్ల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రికార్డు స్థాయిలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జూలై 1న ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, సోమవారంతో ముగిసిందని అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పాఠశాలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో విద్యార్థులు ఎవరూ ఇబ్బందులు పడకూడదని సురక్ష శిబిరాల్లోనే వివిధ ధ్రువీకరణ పత్రాలను కూడా మంజూరు చేశామన్నారు.

- జూలై 31వ తేదీ నాటికి మొత్తం 732 సచివాలయాల పరిధిలో ఉన్న 7,33,037 కుటుంబాల నుంచి 3,27,343 వినతులు వస్తే అక్కడికక్కడే పరిష్కారమయ్యాయన్నారు.
- మొత్తం 12,503 మంది వలంటీర్లు జగనన్న సురక్ష శిబిరాల కోసం తమ క్లస్టర్లలోని 6,75,707 ఇళ్లలో సర్వే నిర్వహించారన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- రెవెన్యూలో 3,04,023, ఆధార్–19705, పౌర సరఫరాలు–2392, గ్రామ వార్డు సచివాలయాలు–527, వైద్యారోగ్యం–కుటుంబ సంక్షేమం శాఖ–314, వ్యవసాయ శాఖ–162, రిజిస్ట్రేషన్స్, స్టాంపులు–116, గ్రామీణాభివృద్ధి–70, పురపాలక పరిపాలన–19, కార్మిక శాఖ–6, ఏపీడీసీఎల్–5, పోలీసు శాఖకు సంబంధించి నాలుగు సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. ఇంకా ఎవరికైనా పథకాలు అందకపోతే వెంటనే వలంటీర్లను, సచివాలయాన్ని సంప్రదించాలన్నారు.

జీవన ప్రమాణాలు పెరిగితేనే అభివృద్ధి

- పట్టాల పంపిణీలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: సమాజంలో అన్ని వర్గాల జీవన ప్రమాణాలు పెరిగిన నాడే అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనిలో భాగంగానే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరానికి చెందిన 270 మంది లబ్ధిదారులకు మంగళవారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ నియోజకవర్గం మొత్తంగా 20 వేలు పట్టాలు అందజేశామన్నారు. ఇందుకు రూ.500 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.12వేల కోట్లు ఖర్చు చేసి 31 లక్షల మందికి ఇంటి పట్టాలు అందజేశామని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, వారి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తోందన్నాని చెప్పారు. పేదలకు అందించే ఇళ్ల విషయంలో చంద్రబాబు ఒక్క పైసా కూడా ఎందుకు కేటాయించలేదని, పేదల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ప్రజా ధనం వృథా చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, రాజ్యాంగంలో చెప్పిన విధానం ప్రకారం అందరికీ అన్ని అవకాశాలు కల్పించేందుకు గాను ఈ ప్రభుత్వం కృషి చేస్తోందనే వాస్తవాలు గ్రహించాలని హితవుపలికారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, చల్లా అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

వెట'రన్'

- డబ్బై ఏళ్ల వయసులోనూ పరుగులతో పతకాలు సాధిస్తున్న శ్యామ్ సుందర్
- 100 మీటర్ల పరుగులో నేటికీ రాజే
- 50ఏళ్లుగా ఎన్నో రికార్డులు సొంతం



జాతీయస్థాయిలో సాధించిన గోల్డ్‌మెడల్‌తో శ్యామ్

శ్రీకాకుళం కల్చరల్: యాభై ఏళ్లుగా ఆయన పరిగెడుతున్నారు. పతకాలు, అవార్డులు, రివార్డులు, రికార్డులు అన్నీ సాధించారు. డబ్బై ఏళ్ల వయసు వచ్చినా ఇంకా పతకాల వేట ఆపలేదు. ఇన్నాళ్లుగా ఆయన పరుగులు పెడుతున్నా.. సొంత ఇల్లు కట్టుకునేందుకు మాత్రం ఆ పరుగు సరిపోలేదు. ఎన్ని రికార్డులు సాధించినా.. ఆర్థికంగా స్థిరపడేందుకు మా త్రం ప్రయాస తప్పడం లేదు. కరణం మల్లీశ్వరి కంటే ముందే అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించినా.. రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఆయనే బూర శ్యామ సుందర రావు. శ్రీకాకుళంలోని గుడివీధి నుంచి ఆయన మొదలుపెట్టిన పరుగు అంతర్జాతీయ స్థాయి వరకు ఆగకుండా సాగింది.

శ్రీకాకుళం గుడివీధిలో పహిల్వాన్‌గా పేరు పొందిన బూర శ్రీరాములుకు నలుగురు కుమారులు. అందులో శ్యామ్ సుందర్ ఒకరు. ఈయన 1951లో జన్మించారు. ఈ కుటుంబంలో నలుగురు అన్నదమ్ములూ బాస్కెట్‌బాల్‌లో పేరొందిన క్రీడాకారులే. శ్యామ్ సోదరుడు రఘు 12 సార్లు జాతీయ బాస్కెట్‌బాల్ పోటీ ల్లో పాల్గొన్నారు. ఆ కుటుంబంలో దాదాపు 25మంది జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నారు. శ్యామ్ కూడా చిన్నప్పుడు బాస్కెట్‌బాల్ ఆడేవారు. 1979 లో ఉద్యోగంలో చేరిన శ్యామ్ విశాఖ పోర్టు తరపున ఆలిండియా మేజర్ పోర్ట్సు పోటీల్లోనూ బాస్కెట్ బాల్ టీమ్ సభ్యుడిగా పాల్గొన్నారు. అయితే ఆయనకు వినికిడి లోపం ఉండేది. దీంతో టీమ్ సభ్యుల సూచనలు అందుకునేవారు కాదు. దీంతో వ్యక్తిగతంగా ఆడుకునేందుకు స్ప్రింటర్‌గా మారారు. అప్పటి నుంచి 100, 200 మీటర్ల పరుగు పోటీల్లో సత్తా చాటుతూనే ఉన్నారు.

ప్రపంచ స్థాయికి..

శ్యామ్‌కు పుట్టినప్పటి నుంచి వినికిడి సమస్య ఉంది. ఇప్పటి ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో చదువుకున్న ఆయన బీఏ పట్టా కూడా తీసుకున్నారు. వినికిడి సమస్యతో చాలా బాధపడ్డారు. అన్ని అవరోధాలు దాటి బధిరుల విభాగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. మూడేళ్ల కిందట 2020 జనవరిలో కోజికోడ్‌లో జరిగిన వెటరన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల పరుగును 10.9 సెకండ్లలో ముగించి కొత్త రికార్డు నమోదు చేశారు. అదే పోటీలో 200 మీటర్ల విభాగంలో 22.2 సెకండ్లతో మరో కొత్త రికార్డు నెలకొల్పా రు. హర్యానాలో 1981లో జరిగిన జాతీయ బధిరుల పోటీల్లో 100 మీటర్ల పరుగును 11.1 సెకండ్లలో పూర్తి చేసి అప్పట్లో కొత్త రికార్డు సృష్టించారు. 1983లో మద్రాస్‌లో జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 100 మీటర్ల విభాగంలో 11 సెకండ్లలోనే గమ్యస్థానం చేరారు.

వరించిన మెడల్స్

- 1981 నుంచి 2007 వరకు పలు దేశాల్లో జరిగిన ఎనిమిది అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించారు.
- 1992లో సింగపూర్‌లో ప్రపంచ బధిరుల పోటీల్లో 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతపతకాన్ని, 1997లో కౌలాలంపూర్‌లో జరిగిన ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లోనూ, బెంగళూరు ఆసియా వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలో 100 మీటర్ల విభాగంలో కాంస్యం, 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతం అందుకున్నారు.
- 1978 నుంచి 1986 వరకు జాతీయ స్థాయిలో దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన 13 బధిర పోటీలలో పాల్గొని ఏకంగా 30 బంగారు, ఒక రజత పతకంతో మెరిశారు.
- విశాఖ పోర్టు ఉద్యోగిగా 1982 నుంచి 1991 వరకు జరిగిన ఏడు ఆలిండియా మేజర్ పోర్ట్స్ ఓపెన్ కేటగిరీ పోటీల్లో ఒక స్వర్ణం, ఆరు రజత, ఒక కాంస్య పతకం అందుకున్నారు.
- 14 జాతీయ వెటరన్ ఓపెన్ కేటగిరీ పోటీల్లో పాల్గొన్న శ్యామ్ 16 స్వర్ణాలు, ఆరు రజత పతకాలు, ఆరు కాంస్య పతకాలు అందుకున్నారు.

ప్రోత్సహిస్తే..

నాకు వినికిడి లోపం ఉన్నా ఎన్నో పతకాలు సాధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి పేరు తెచ్చాను. ఒక క్రీడాకారుడిగా జిల్లా అధికారుల నుంచి గానీ ప్రభుత్వం నుంచి గానీ ఎలాంటి సాయం అందలేదు. కనీసం ఇల్లు కట్టుకునేందుకు స్థలమైనా మంజూరు చెయ్యాలి.

– శ్యామసుందరరావు, శ్రీకాకుళం

క్లుప్తంగా

'మూత్రగండాలు'పై కవితలకు ఆహ్వానం

పలాస: ఉద్దానం ప్రాంతంలో మూత్ర పిండాల వ్యాధులపై కవులు, కళాకారులు స్పందించాలని, సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'మూత్ర గండాలు' అనే శీర్షికపై కవితలు, పాటలను ఆహ్వానిస్తున్నామని పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 30లోగా బద్రి కూర్మారావు, డోర్ నెంబరు 26-3-26, కొత్తవీధి, దాసన్నపేట, విజయనగరం -535002 చిరునామాకు పంపించాలని కోరారు. ఎంపిక చేసిన వాటిని పుస్తక రూపంగా తీసుకురావాలని భావిస్తున్నామని తెలిపారు. రంగోయి గ్రామంలోని వివేకానంద, నారాయణగురు చైతన్య సంఘం, కళింగసీమ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు దంతలో ప్రజాభిప్రాయ సేకరణ

కోటబొమ్మాళి : మండలంలోని దంత గ్రామ పంచాయతీని సారవకోట మండలంలో విలీనం చేయాలని సర్పంచ్‌తో పాటు కొందరు గ్రామస్తులు ఇటీవల కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు దరఖాస్తు చేశారు. ఈ మేరకు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించనున్నారు. రెండు మండలాలకు చెందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆహ్వానాలు అందించినట్లు కోటబొమ్మాళి డీటీ రఘుపతి మధు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్‌బీఐ డీజీఎం



రంగరాజన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని అమరావతి ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.రంగరాజన్ సతీసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ఆలయానికి రెండేళ్ల క్రితం సేఫ్టీ లాకర్‌ను ఇచ్చామని, ఇప్పుడు మెటల్ డిటెక్టర్ల ఏర్పాటుతో పాటు సెల్‌ఫోన్ల జామర్‌ను త్వరలో అందజేస్తానని ప్రకటించారు. ఈయన వెంట భార్య, కెనరా బ్యాంకు ఏజీఎం ఇందిరన్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అరసవల్లి: విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన 12 డిమాండ్లను యాజమాన్యం, ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ జి.రమేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణ మేరకు మంగళవారం విద్యుత్ ఉద్యోగులతో డేఅండ్‌నైట్ కూడలి నుంచి స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్కిల్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఎం.వి.గోపాలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కో-కన్వీనర్ జె.సురేష్‌కుమార్, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

వైద్యారోగ్య శాఖపై కలెక్టర్ ఆగ్రహం

- పలువురు అధికారులకు షోకాజ్ నోటీసులు
- ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిని సెలవులోకి పంపించాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశం
- సర్వే, ఆన్‌లైన్ అప్‌లోడ్‌లో నిర్లక్ష్యంపై మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైద్యులు రోగులకు మెరుగైన సేవలు అందించాలని, వ్యాధి పూర్తిగా నయమయ్యేంత వరకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్.సి.డి.సర్వే, బీపీ, షుగర్ రోగుల నమోదు, చికిత్స వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం తదితర వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్కువగా అప్‌లోడ్ చేసిన గంగువాడ, చౌర్లంగి, మాకివలస, జి.సిగడాం, సింగుపురం పీహెచ్‌సీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మి తులసీని పలాసకు బదిలీ చేయాలని డీఎంహెచ్‌ఓ మీనాక్షిని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న డి.పి.హెచ్.ఎన్.ఓ శైలజను మందలిస్తూ షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. కారణాలు చెబితే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. చక్కగా పనిచేసిన కింతలి, తొగరాం వైద్యాధికారులను అభినందించారు.

- ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సి.పి.శ్రీదేవిని సెలవులోకి పంపించాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ లింగరాజు పనితీరు మెరుగుపరుచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.
- ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. పీహెచ్‌సీలో ఉంటున్న ఇద్దరు మెడికల్ ఆఫీసర్లలో ఒకరు ఫ్యామిలీ డాక్టరుగా వ్యవహరించి గ్రామాల్లోకి వెళ్లి వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణులకు మూడు నెలలు నిండిన తర్వాత టీటీ, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి డెలివరీకి ఏడు రోజుల ముందుగానే ఆస్పత్రిలో జాయిన్ చేయించాలని ఆదేశించారు.
- మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధుల విజృంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో సచివాలయం వలంటీర్ల సాయంతో ఫీవర్ సర్వే నిర్వహించాని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, అదనపు డీఎంహెచ్‌ఓ ఎన్.అనూరాధ, డీఐఓ, ఆర్.వి.ఎస్.కుమార్, లక్ష్మి తులసీ, సి.పి.శ్రీదేవి, జిల్లా మాస్‌మీడియా అధికారి పైడి వెంకటరమణ, ప్రకాష్‌రావు, రమణమూర్తి, కొయ్యాన అప్పారావు, సుజాత, డీఎంఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మైలురాయిగా 'సురక్ష'



మాట్లాడుతున్న రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్

నందిగాం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వైఎస్సార్ సీపీ పాలనలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మంగళవారం నందిగాం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుకోని వారికోసం, 11 రకాల ధ్రువపత్రాలు ఎలాంటి రుసుం లేకుండా అందించడం దేశ చరిత్రలోనే తొలిసారని పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గంలో 38 వేల ధ్రువపత్రాలు అందజేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల్లో ఇంత పెద్ద ఎత్తున ఒక డ్రైవ్ చేపట్టిన దాఖలాలు లేవన్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యులు అవసరాలను మాత్రమే గుర్తించే వారని చెప్పారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకుంటే చెత్తబుట్టల్లోకి వెళ్లేవని, నేడు ఇంటి దగ్గరకు వచ్చి వారికి పత్రాలు అందజేస్తున్నారని, ఇదే చంద్రబాబునాయుడుకు, జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న తేడా అని వివరించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నా ఒక్క వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌గానీ, ఎంపీటీసీ గానీ, ప్రజా ప్రతినిధులు గానీ అవినీతి ఆరోపణలు లేకుండా ఉన్నారంటే, అది పాలనలో పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, సర్లాన బైరాగి, తమిరె దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో దొంగల కలకలం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి విద్యుత్‌నగర్ కాలనీలో పగటిపూట ఇద్దరు దొంగలు సంచరించడం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు టీవీ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ వీధుల్లో తిరిగారు. ఈ క్రమంలో బొమ్మాళి ఎంకయ్య ఇంట్లో ఎవరూ లేని విషయం గుర్తించి ఓ వ్యక్తి బయటే ఉండి, మరో వ్యక్తి ఇంట్లోకి చొరబడి వెండి, వంట సామగ్రితో పారిపోతుండగా ఆ మూట చేయి జారి రోడ్డుపై పడింది. అందులో సామగ్రి రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో శబ్దం విని స్థానికులు దొంగలను పట్టుకొనే ప్రయత్నం చేశారు. అప్పటికే దొంగలు తప్పించుకొని పారిపోయారు. ఈ ఘటనపై పిర్యాదు అందలేదని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న ఎం.కృష్ణారావుకు విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడిన జి.సిగడాం గ్రామానికి చెందిన రెడ్డి తాతతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సామంతుల రామారావు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన రెడ్డి ఆదినారాయణ తమ భూమికి సంబంధించి న్యాయం చేయాలని పొందూరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు మేరకు తమ భూమి అప్పగించాలని కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 91/2,91/3,91/8,139/9 సర్వేనెంబరులో ఉన్న భూమిని అప్పగించడానికి వీఆర్‌ఓ, ఆర్ఐ కలిసి భూమి హద్దులు వేశారు. దీంతో రెడ్డి తాత, మరో నలుగురు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి దుర్భాషలాడారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చివరిదశకు ఆరో సెమిస్టర్ 'స్పాట్'

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ చివరి దశకు చేరుకుంది. ఐదు కేంద్రాల్లో మూల్యాంకణ జరుగుతుండగా నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్‌ఆర్, శ్రీకాకుళం రూరల్ గాయత్రి కేంద్రాల్లో మంగళవారంతో ముగిసింది. ఈ నెల మూడు నాటికి శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో స్పాట్ ముగియ నుంది. పీజీ ప్రవేశాల నోటిఫికేషన్ త్వరలో రానున్న నేపథ్యంలో ఫలితాలు త్వరితగతిన విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

పూజ గదిలో ప్రమాదం

- రూ. 2 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఫ్రిజ్



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గూనపాలెం సమీపంలో సబ్ డివిజనల్ పోలీస్ కేంద్రం వెనుక ఉన్న రేకుల ఇంట్లో దీపం ఒత్తి కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. పట్నాన శేఖర్ కార్పెంటర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిపి రేకుల ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనిమీద ఇద్దరూ బయటకు వెళ్లారు. పిల్లలూ స్కూల్‌కు వెళ్లిపోవడంతో ఇంట్లో ఉన్న దేవుని పటాల వద్ద దీపం ఒత్తి ముందు ఉన్న చాపకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఇల్లు ఇరుకుగా ఉండటం, సామాన్లన్నీ ఒకేచోట ఉండటంతో మంటలు అంటుకున్నాయి. బయటకూ పొగ రాకపోవడంతో ఎవ్వరికీ తెలియలేదు. కొద్దిసేపటి తర్వాత శేఖర్ భార్య ఇంటి తలుపు తెరిచేసరికి పొగ, మంటలు ఒక్కసారిగా ఎగిశాయి. ఈలోగా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయగా లీడింగ్ ఫైర్‌మేన్ పి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో సిబ్బంది కూర్మారావు, రహీమ్, భట్లు, రాజు ఘటనాస్థలికి చేరి మంటలు అదుపుచేశారు. అప్పటికే టీవీ, ఫ్రిజ్, కూలర్, మంచం, గ్రైండర్, హోమ్ థియేటర్, బీరువా, తదితర సామగ్రి బూడిదయ్యాయి. రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని ఏడీఎఫ్ఓ చెప్పారు. కష్టపడి కొనుక్కున్న వస్తువులన్నీ కాలిపోయాయని బాధితులు విచారం వ్యక్తం చేశారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి గ్రామానికి చెందిన వృద్ధుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కూర పాత్రో(69) అనేవృద్ధుడు గ్రామంలోని గజపతి మహారాణి చెరువుకు స్నానానికి వెళ్లాడు. ఈత రాక పోవడంతో మునిగిపోయాడు.

స్థానికులు గుర్తించి బయటికి తీసినప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

జలుమూరు: మండలంలోని లింగాలవలసలో గంజాయితో పట్టుబడిన మెజ్జాడ సరస్వతిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు మంగళవారం తెలిపారు.స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూర్ సిబ్బంది, స్థానిక పోలీసులకు వచ్చిన సమచారం మేరకు సరస్వతి ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించగా సుమారు 11 కేజీల గంజాయిని గుర్తించినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.55 వేలు ఉంటుందని అంచనా. ఈమెను అరెస్ట్ చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నరసన్నపేట సీఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

సారవకోట: మూగుపురం గ్రామానికి చెందిన ఎడ్ల సూర్యనారాయణ అలియాస్ రవికుమార్‌కు ఎస్సీ, ఎస్టీ కోర్టు మంగళవారం 20 సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. 2021 ఆగస్టు 19న మూగుపురం గ్రామానికి చెందిన మూగ, చెవుడు, మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారం చేసినట్లు ఆమె తల్లి సారవకోట పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. అత్యాచారం,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముద్దాయిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మంగళవారం 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.51 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్ఐ అప్పారావు తెలిపారు.

వెళ్లిపోయావా తమ్ముడూ..!

- పాముకాటుతో తొమ్మిదో తరగతి విద్యార్థి మృతి
- అక్కకు తప్పిన ముప్పు
- ఇంట్లోకి వెళ్లి కాటు వేసిన కట్లపాము
- తోలాపిలో విషాదఛాయలు



విద్యార్థి మృతదేహం



కాటువేసిన పాము

పొందూరు: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం వారిది. తల్లి తీవ్ర అనారోగ్యంతో శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తండ్రి తాపీ పనిచేసేందుకు కొద్ది రోజుల క్రితం రాజమండ్రి వెళ్లాడు. అక్క, తమ్ముడు కలిసి ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో కట్లపాటు కాటు వేయడంతో తమ్ముడు మృత్యువాతపడ్డాడు. ఈ విషాద ఘటన పొందూరు మండలం తోలాపిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తోలాపి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న రావాడ చిన్నయ్య, నీలవేణికి కుమార్తె రమ్య, కుమారుడు లవకుమార్(14) ఉన్నారు. లవకుమార్ తోలాపి జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నయ్య, నీలవేణి రోజువారీ కూలీలు. నీలవేణికి అనారోగ్యం కారణంగా శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ పోషణ కోసం చిన్నయ్య రెండు రోజుల క్రితం రాజమండ్రి వెళ్లాడు. దీంతో అక్క రమ్యతో కలిసి లవకుమార్ ఇంటిలో ఉంటున్నారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గాలి తగలడం లేదని తలుపుతీసి పడుకున్నారు. ఆ సమయంలో కట్లపాము లవకుమార్‌ను కాటువేసింది. మెలకువ రావడంతో ఏదో పురుగు కుట్టిందనుకుని నిద్రలోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పాము మెడకు చుట్టినట్లు అనిపించడంతో ఒక్కసారిగా నిద్రలేచి పామును గుర్తించాడు. పామును విసిరేస్తే అక్కకు ప్రమాదం జరుగుతుందని గ్రహించి భయపడకుండా చేతితో తీసి నేలకు గట్టిగా కొట్టాడు. తర్వాత పామును కొట్టి చంపాడు. అలికిడి కావడంతో అక్క నిద్రలోనుంచి లేచింది. అప్పటికే పాము కరిచి చాలాసేపు కావడం, తమ్ముడి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉండటంతో బయటకు వెళ్లి చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు లవకుమార్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. అప్పటి వరకు తనతో ఉన్న తమ్ముడు పాముకాటుకు బలికావడంతో అక్క కన్నీటిపర్యంతమైంది. తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేసింది. వారు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ముందు రోజు వరకు రోజూ పాఠశాలకు వస్తున్న విద్యార్థి ఇక లేడని తెలిసి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి మృదేహానికి పోస్టుమార్టం చేయించారు.

ఓబీసీ పేరుతో టీడీపీ దిగజారుడు రాజకీయం



ముఖ్యమంత్రిని కలిసిన కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఓబీసీ పేరుతో టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేయడం తగదని, రాజకీయ లబ్ధికోసం వెంపర్లాడటం మానుకోవాలని మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి అన్నారు. నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం కమిషన్ రాష్ట్రంలో అనేక కులాలను, జిల్లాలో కొన్ని వెనుకబడిన అగ్ర కులాలను బీసీ జాబితాలో చేర్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కళింగ కోమటి, పొందర, అరవల, శిష్టకరణ , సొండి తదితర 36 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర అసెంబ్లీలో చర్చించి తీర్మాణ ప్రతిపాదన, కేంద్ర ప్రభుత్వానికి పంపించడం శుభపరిణామన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం విశాఖలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. ఇదే విషయమై ఆయా కులాల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లంతా కలిసి రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డితో కలిసి త్వరగా కేంద్ర ఆమోదాన్ని జరిగేలా చూడాలని ఆమె కోరారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ టెస్టులు



మాట్లాడుతున్న డీఆర్వో మురళీకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 7 వరకు జరగనున్న శాఖాపరమైన పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు జిల్లాలో శ్రీశివానీ, శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలను కేంద్రాలుగా కేటాయించినట్లు తెలిపారు. 1511 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. కేంద్రాల 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, అభ్యర్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత అధికారులకు సూచించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సెల్ ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. సర్వీసు రూల్స్ పుస్తకాలు మాత్రమే తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ బి.సీహెచ్.కుమార్ రాజా, సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి రమణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ మిగులు సీట్లు 3176

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐలకు సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తికాగా, రెండో విడత కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నారు. మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 640 సీట్లు ఉండగా, 270 సీట్లు భర్తీ అయ్యాయి. 370 సీట్లు మిగిలిపోయాయి. 20 ప్రైవేట్ ఐటీ ఐల్లో 3036 సీట్లు ఉండగా, 230 ప్రవేశాలు జరిగాయి. ప్రైవేట్ ఐటీఐల్లో 2806 సీట్లు మిగిలి పోయాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3676 సీట్లుకు, మొదటి విడతలో 500 సీట్లు ప్రవేశాలు జరగ్గా, 3176 మిగిలాయి. ఈ నెల 3వ తేదీ నుంచి రెండో విడత ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 3వ తేదీన ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీల్లో, 4వ తేదీన పలాస కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో, 5, 7 తేదీల్లో ప్రైవేట్ ఐటీఐల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. షెడ్యూల్ మేరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఎచ్చెర్ల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల క న్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అరుణకుమారి

లావేరు: ఫ్లోరోసిస్ వ్యాధిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ అరుణకుమారి అన్నారు. మురపాక పీహెచ్‌సీని మంగళవారం అరుణకుమారి సందర్శించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలుతో సమావేశం నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తాగునీరు, తినే ఆహారంలో ఫ్లోరైడ్ శాతం 1.5 శాతం కంటే ఎక్కువగా ఉంటే వ్యాధి వస్తుందన్నారు. దంత సమస్యలు, ఎముకలు గుల్ల బారిపోవడం, నడుము సంబంధిత వ్యాధులు వస్తాయని చెప్పారు. కాల్షియం ఎక్కువగా లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో హెల్త్ అసిస్టెంట్ ఆర్.శ్యామ్‌సుందర్, ఈవో తిరుమలరావు, పీహెచ్ఎన్ ఎస్.వి.రమణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



పొదల్లోకి దూసుకెళ్లిన కారు

కవిటి: మండలంలోని కవిటి-ఈదుపురం రోడ్డులో కొరికానపుట్టుగ సమీపంలో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు బలంగా ఢీకొట్టడంతో స్తంభం ఒరిగిపోయింది. కవిటి వైపు నుంచి వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్తంభం ఒరిగానా వైర్లు తెగలేదని, ఏమాత్రం వైర్లు తగిలినా పెను ప్రమాదం జరిగిఉండేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నుంచి విద్యుత్‌శాఖ నిబంధనల ప్రకారం నష్టపరిహారాన్ని వసూలు చేసేందుకు అధికారులుచర్యలు చేపట్టారు.